

డీఎస్పీగా యశ్వంత్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

పుట్టపర్తి అర్బన్ డీఎస్పీగా తంగిరాల యశ్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బాలాజీ జిల్లా పుత్తూరు నుంచి ఇక్కడికి వచ్చారు. గతంలో పనిచేసిన డీఎస్పీ రామకృష్ణయ్య పదవి విరమణ అనంతరం సుమారు ఆరు నెలల తర్వాత ఖాళీగా ఉన్న ఈ పోస్టులో యశ్వంత్ నియమితులయ్యారు. ఆయనకు సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, పోలీసులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పుట్టపర్తిలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా అడ్డుకుంటామన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రభుత్వ స్టేడియంలు ప్రయివేటుపరం చేయొద్దు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియంలను పే అండ్ ప్లై పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని విద్యార్థులు, యువకులు, క్రీడాభిమానులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో జెవివి కార్యాలయంలో డివైఫ్ఐ జిల్లా కోశాధికారి నూరుల్లా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్టేడియంలను ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం అంటే పేద, మధ్య తరగతి విద్యార్థి, యువకులను క్రీడలకు దూరం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాల్సిందిపోయి ఉన్న అరకొర ఆట స్థలాలను కూడా ప్రయివేట్ పరం చేస్తే క్రీడాకారులు ఎలా క్రీడా పోటీలలో రాణిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో బ్యాడ్మింటన్, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఇండోర్ స్టేడియం గేమ్స్ అన్నీ కూడా లీజ్‌కి ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికే విద్య ప్రయివేటీకరణ వల్ల స్కూళ్లలో ఆటలకు ప్రాధాన్యత తగ్గిపోయి విద్యార్థులకు కేవలం చదువు తప్ప వేరే ధ్యాస లేకుండా చేస్తున్నారని తెలిపారు. కనీసం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కొద్ది మంది విద్యార్థులు, యువకులు ఆటల పోటీలలో రాణిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడడం అన్యాయంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఆపాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయి స్వామి, ఎహెచ్ఎస్ సోమర రాహుల్, టిఎన్ఎస్ఎఫ్ వెంకటప్ప, నిరుద్యోగ పోరాట సమితి నాయకులు రామన్న, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కదిరి విద్యార్థులు

ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు కదిరి విద్యార్థులకు ఎంపికయ్యారు. అనంతపురము లోని ఎంకె స్పోర్ట్స్ అకాడమిలో అనంతపురం, సత్యసాయి జిల్లాల అండర్ -9, అండర్ -12 కేటగిరీలో ఆర్చరీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. మాస్టర్ షేక్షావలి ఆధ్వర్యంలో కదిరిలోని బ్లూమూన్ ,సెయింట్ థామస్ శ్రీ చైతన్య స్కూల్, కెఎల్ఎన్ కోచింగ్ సెంటర్ నుండి విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ -12 కేటగిరీలో బ్లూమూన్ స్కూల్ విద్యార్థి షరణి ,సెయింట్ థామస్ స్కూల్ డింబు శ్రీ, షాఫియా సనా, శ్రీ చైతన్య స్కూల్ నుంచి నాదియా తబస్సుమ్, హనీష్ కుమార్, కెఎల్ఎన్ కోచింగ్ సెంటర్ నుంచి ప్రజ్ఞేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29న విజవాడలోని ఒల్గా అకాడమీలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొన్నట్లు కోచ్ షేక్షావలి తెలిపారు.

రైతుల కోసం జైలుకెళ్లడానికైనా సిద్ధం : మాజీ మంత్రి

ప్రజాశక్తి-రామగిరి

భారీ వర్షాలతో ఎంత మంది రైతులు నష్టపోయారో తెలుసుకోలేని అసమర్థ స్థితిలో ప్రభుత్వం ఉందని, రైతుల కోసం తాను జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టిన పాదయాత్ర రామగిరి మండలంలో కొనసాగింది. ఆదివారం జరిగిన పాదయాత్రకు రైతుల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఉదయం గరిమేకలపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఎంసి.పల్లి, తిమ్మాపురం, పెద్ద కొండాపురం, చిన్న కొండాపురం, మక్కినవారిపల్లి, పెదయ్యగారి కొట్టాల, పేరూరు డ్యామ్ కాలనీ నుంచి పేరూరు వరకు సాగింది. సుమారు 18 కిలోమీటర్ల మేర పాదయాత్ర జరిగింది. ప్రతి గ్రామంలో రైతులను కలుసుకుని వారికి జరిగిన పంట నష్టాన్ని అడిగి తెలుసుకుంది. ప్రస్తుతం పంటల పరిస్థితి అలాగే ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం గురించి ఆరా తీశారు. చాలా మంది రైతులు వాణిజ్య పంటల సాగుకు డ్రిప్ పరికరాలు పంపిణీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇన్సూరెన్స్ విషయంలో చాలా అన్యాయం జరిగిందని వాపోయారు. పంట నష్టం అంచనా వేయడానికి వ్యవసాయశాఖ సిబ్బంది వచ్చారా అని అడిగి తెలుసుకున్నారు.. పాదయాత్ర అనంతరం పేరూరులోని డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి రైతుల సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ రైతులు సమస్యల్లో ఉన్నప్పుడు వారి కష్టాలు తెలుసుకునేందుకు తాను పాదయాత్ర చేస్తుంటే అనుమతులు ఇవ్వొద్దని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. తాను యుద్ధాలు చేయడానికో, గొడవలు చేయడానికి వెళ్లడం లేదని అన్నారు. రైతుల సమస్యలు తెలుసుకోవడం వారికి అండగా నిలబడటం ప్రతిపక్షాలుగా తమ బాధ్యత అని అన్నారు. పాదయాత్రను ఆపాలని చూస్తే మేము వెనక్కు తగ్గమని హెచ్చరించారు. పోలీసులు కేసులు పెట్టినా జైలుకు పంపినా పాదయాత్ర చేసి తీరుతామని అన్నారు. భారీ వర్షాలతో రైతులు నష్టపోతే ప్రజాప్రతినిధులు ఒక్కరైనా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పంటలను చూస్తే ఎంత నష్టపోయారన్నది తెలిసేదని అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టం వివరాలు కూడా లేకపోతే వాటి ద్వారా రైతులకు ఏం భరోసా ఉంటుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ బటన్ ముఖ్యమంత్రిగా మారారని, కనీసం రైతుల కష్టాలను తెలుసుకునే పరిస్థితుల్లో లేరని ఎద్దేవా చేశారు. మరోవైపు ఈ ఏడాది ఇన్సూరెన్స్ ఇచ్చామని ఘనంగా చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు ఒక్కసారి గ్రామాల్లోకి వచ్చి చూడాలన్నారు. ఒక్కో ఎకరానికి రూ. 20వేల నుంచి 30వేల రూపాయల వరకు పెట్టుబడి అయితే ఇన్సూరెన్స్ రూ. 2వేలు గరిష్టంగా నాలుగు వేల రూపాయలు వచ్చిందన్నారు. తాజాగా భారీ వర్షాల కారణంగా వేరుశనగ, టమోటా, మిర్చి, బొప్పాయి ఇతర ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతం నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ. 30 వేల నుంచి 50వేల రూపాయల వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను క్షేత్రస్థాయిలో తెలుసుకున్న అంశాలతో ప్రభుత్వానికి రైతుల తరుపున లేఖ రాస్తామని సునీత తెలిపారు.



పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీత, నాయకులు

సమస్యల నీడలో..సరస్వతి నిలయాలు

మనిషికి పుస్తకాలతో విడదీయరాని అభినాభావ సంబంధం ఉంది. సమాచార సాంకేతిక విప్లవం రోజు రోజుకూ కొత్తపుంతలు తొక్కుతూ రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్ వంటి ఆధునిక సమాచార సాధనాలు ఎన్ని వచ్చినా పుస్తకాలకు ప్రాధాన్యత ఎప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం. మనకు తెలియని ఎన్నో విషయాలను పుస్తక పఠనం ద్వారా తెలుసుకోవచ్చు. అలాంటి పుస్తకాల నియలయాలే గ్రంథాలయాలు. నేడు మారుమూల పల్లెల్లో కూడా గ్రంథాలయాల సాహితీ సౌరభాలు గుబాలిస్తూనే ఉన్నాయి. ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అధికారులు విద్యార్థులు, యువత మేధో వికాశానికి విశేష కృషి చేస్తున్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ఆటలు, పాటల పోటీలు నిర్వహిస్తూ విశేషంగా ఆకట్టుకుంటున్నారు. వారి దృష్టిని గ్రంథాలయాల వైపునకు మరల్చున్నారు. అయితే వైజ్ఞానిక కేంద్రాలుగా వెలుగొందాల్సిన గ్రంథాలయాలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

గంథాలయాల్లో కానరాని సౌకర్యాలు
ఇరుకు గదుల్లో పాఠకుల ఇక్కట్లు
కంప్యూటర్లు లేవు..కొత్త పుస్తకాలూ రావు..
నేటి నుంచి గ్రంథాలయాల వారోత్సవాలు

ప్రజాశక్తి-గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో 69 ప్రభుత్వ శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఒక జిల్లా గ్రంథాలయం, 9 గ్రామీణ గ్రంథాలయాలు, 66 పుస్తక నిక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. 18 గ్రంథాలయాలు అద్దె, ఉచిత భవనాల్లోనే నిర్వహణ కొనసాగుతోంది. సొంత భవనాలున్న గ్రంథాలయాల్లో కూడా ఇరుకు గదులు ఉండడంతో గ్రంథాలయాల కొచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 12 గ్రంథాలయాలకు లైబ్రేరియన్లు లేరు. వీటిలో అత్యధికంగా రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లతోనే నడుస్తున్నాయి. 14 ఏళ్ళుగా అనేకమంది లైబ్రేరియన్లు ఉద్యోగ విరమణ చేయడంతో వాటిని ప్రభుత్వం భర్తీ చేయలేదు. దీంతో రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు అన్ని పనులూ చూసుకుంటున్నారు. లైబ్రరీల నిర్వహణలో లైబ్రేరియన్ల విధి ఎంతో కీలకం. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను భద్రంగా చూడటంతో పాటు వాటిని క్రమ పద్ధతిలో ఉంచి కావాల్సిన పుస్తకాలను క్షణాల్లో తీసుకునేలా ఏర్పాటు చేస్తారు. తరగతుల వారీగా పుస్తకాలను సెల్ఫుల్లో ఉంచుతారు. చందాదారులకు కావాల్సిన పుస్తకాలను డెలివరీ చేయడంతో పాటు గ్రంథాలయానికి సంబంధించిన అన్ని రికార్డులు నిర్వహిస్తుంటారు. ఇంత కీలకమైన లైబ్రేరియన్లు లేకుండా ప్రస్తుతం గ్రంథాలయాలు నడుస్తుండడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని పాఠకులు కోరుతున్నారు. గ్రంథాలయాల సమయాల్లో కూడా మార్పులు చేసి సమయాన్ని పెంచాలని పలువురు పేర్కొంటున్నారు.



నిధులు లేక కుంటుబడుతున్న అభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో ఏటా లక్షలాదిమంది పాఠకులకు, వేలాదిమంది చిన్నారులు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు ఇప్పుడు సమస్యల చెదలో సతమతమవుతున్నాయి. ఎంతోకాలంగా నిధులు లేక అభివృద్ధి కుంటుపడిపోయి అవస్థలతో అల్లాడుతున్నాయి. పంచాయతీల నుంచి, మునిసిపాలిటీల నుంచి, నగరపాలక సంస్థ నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు ఏళ్ల తరబడి రాకపోవడంతో గ్రంథాలయాల మనుగడ నానాటికీ దుర్భరంగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులైనా గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తే తప్ప.. గ్రంథాలయాలకు మోక్షం ఉండదు.



గుత్తి పట్టణంలో ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్న గ్రంథాలయం... పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కంప్యూటర్లు లేవు..కొత్త పుస్తకాలూ లేవు..

జిల్లాలో చాలా గ్రంథాలయాలు గతంలో నిత్యం పాఠకులతో కిక్కిరిసి ఉండేవి. యువకులు, విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఇక్కడికొచ్చి పుస్తకాలు చదువుకునేవారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ బుక్స్ కూడా లభ్యమవుతుండడంతో విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలోనే వచ్చేవారు. అయితే, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఈ గ్రంథాలయాలు కూడా నిధులు లేక నీరసపడిపోయాయి.

శబ్ద కాలుష్యంతో చదవలేని పరిస్థితి..

గ్రంథాలయం అనగానే పిన్ డ్రాప్ సైలెన్స్ అనేది గుర్తుకు వస్తుంది. ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచేవిధంగా గ్రంథాలయం ఉండాలి. జిల్లా, పట్టణ లైబ్రరీల్లో అవేవీ కానరావడం లేదు. కారణం ప్రధాన రహదారులకు అవి పక్కనే ఉండడం, వాహనాల రణగొణ శబ్దాల మధ్య గ్రంథాలయంలో చదవడం అనేది గగనంగా మారింది. ఉదయం సాయంత్రం వేళల్లో శబ్ద కాలుష్యం మరీ ఎక్కువగా ఉంటుంది. శబ్దాలని భరించలేక విద్యార్థులు చాలా సందర్భాలలో గ్రంథాలయ తలుపులు మూసి లోపల చదువుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

చెదలు పడుతున్న పుస్తకాలు

మరోవైపు జిల్లాలోని అనేక గ్రంథాలయాల్లో క్రమేణా పుస్తకాలు చెదలు పడుతున్నాయి. పుస్తకాలను భద్రపరిచేందుకు తగు సామగ్రి కానీ, గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్ల వ్యవస్థ కానీ అందుబాటులో లేవు. గ్రంథాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రతిపాదనలున్నాయి. కానీ అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఒక్కో లైబ్రరీకి కనీసం రెండు కంప్యూటర్లన్నా అవసరం. కానీ..పట్టించుకునే వారెవరు?.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఈ దుస్థితులను గమనించి సెస్సు బకాయిలు ఇప్పించి జిల్లాలో గ్రంథాలయాలకు పునరుజ్జీవం ప్రసాదించాలని పాఠకలోకం ప్రార్థిస్తోంది.

వారోత్సవాలను జయప్రదం చేస్తాం

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి ఏడు రోజులు పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. 14వ తేదీన ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం. 15వ తేదీన మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయాల ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు. 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు. 19న దిశా చట్టం మహిళా సాధికారతపై చర్చ. 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, ముగింపు వేడుకలు నిర్వహిస్తాం.

- రామాంజనేయులు, శాఖ గ్రంథాలయాధికారి

మహిళల్లో ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

డిఆర్‌డిఎ పీడీ కెఎస్.నరసయ్య



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళా సంఘాల ద్వారా మహిళల్లో ఆర్థిక స్వావలంబన తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వైఎస్సార్ క్రాంతి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ కెఎస్.నరసయ్య తెలిపారు. మహిళా సంఘాల ద్వారా మహిళల్లో చైతన్యం తీసుకురావడం, వారి ఆదాయ వనరులను పెంచి తద్వారా వారి ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలను ప్రభుత్వం ఈ శాఖ ద్వారా చేపడుతోందన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా వారికి రుణాలు ఇప్పించే విధంగా గతంలో పనిచేసిన ఈ సంస్థ ప్రస్తుతం మహిళ జీవన విధానంలో పూర్తిగా మార్పులు తెచ్చి వారికి శాశ్వత ఆదాయ వనరులు చేకూర్చే విధంగా తగిన ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి, మహిళల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. మహిళల్లో గణనీయ మార్పులు తెస్తున్న ఈ సంస్థ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో కీలకంగా మారాయని చెప్పారు. ఈ సందర్భంగా సంస్థ పీడీ నరసయ్య 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తారా ?

జవాబు : గతంలో బ్యాంకు లింకేజీ ద్వారా, స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించేవారం. కొత్తగా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో క్లస్టర్ విధానం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. వంద కుటుంబాలు ఖాదీ వికాస్ కార్పొరేషన్ ద్వారా చేస్తున్న వృత్తిలో సాంకేతికను జోడించి వారిలో నైపుణ్యత పెంచి ఆదాయ వనరులు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. చింతపండు సేకరణపై ఆధారపడిన వారు, తినుబండారాలు తయారుచేసి అమ్ముకునే వారిని క్లస్టర్‌లోకి తీసుకువచ్చి మహిళా సమాఖ్య ద్వారా వారికి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తున్నాం. వారు తయారు చేసిన ఆహార ఉత్పత్తులకు ఒక బ్రాండ్ లేకపోవడంతో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పించి అభివృద్ధికి కషి చేస్తాం.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? సభ్యులు ఎంతమంది? మండల సమాఖ్యలు ఎన్ని?

జవాబు : జిల్లాలో మొత్తం సహాయక సంఘాలు 33,686 ఉన్నాయి. ఇందులో 3,53,555 మహిళలు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 32 మండలాల్లో 32 మహిళా సమాఖ్యలు ఉన్నాయి. గ్రామ సంఘాలు 1531 ఉన్నాయి. ఇందులో అన్ని సామాజిక కులాల మహిళలు భాగస్వాములుగా ఉన్నారు.

ప్రశ్న : ఇంకా ఏయే కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. వాటి వివరాలు తెలపండి?

జవాబు : వైఎస్సార్ పింఛను కానుక కింద 2.54 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.2500 ప్రతి నెలా వారి ఇంటి వద్దకే వాలంటీర్లు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత అభయ హస్తం, డయాలసిస్ పింఛన్లు ఉన్నాయి. నవరత్నాలలో భాగంగా వైఎస్సార్ ఆసరా కింద 23,288 మంది మహిళా సంఘాల సభ్యులు లబ్ధి పొందారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద జిల్లాలో రూ.51.21 కోట్లు 30957 సంఘాలు లబ్ధి పొందాయి. వైఎస్సార్ చేయూత రూ.372.13 కోట్లతో 198472 మంది ఈ ఆర్థిక సంవత్సరంలో లబ్ధి పొందారు. జగనన్న తోడు కింద 11042 మందికి లబ్ధి చేకూరింది.



ప్రశ్న : మహిళలకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

జవాబు : మహిళల అభివద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతోంది. వారు ఆర్థికంగా నిలబడాలని తద్వారా వారి కుటుంబం పిల్లల బాగు కోసం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలను బాగా చదివించాలి. వృత్తిలో నైపుణ్యం పెంచుకుని ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి. వారిలో ఉత్పాదకశక్తి పెరగాలి. తాత్కాలిక ఆదాయం కాకుండా శాశ్వత ఆదాయం పొందే విధంగా దృష్టి పెట్టాలి. అందుకు ప్రభుత్వంతో పాటు మహిళా సమాఖ్యలు తోడ్పాటు అందిస్తాయి.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి కదిరి టౌన్

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కదిరి సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు విద్యార్థునులకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం నల్లచెరువు ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞానసదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ర్యాగింగ్, దిశా చట్టం, న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఎస్ ప్రతిమ, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు శ్రీ లింగాల లోకేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది కె. నరసింహులు, న్యాయవాది వీరనారాయణ, హాస్టల్ వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

వైసిపి ప్రజావ్యతిరేకి : టిడిపి

ప్రజాశక్తి కదిరి టౌన్

జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందనిటిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి కదిరి పట్టణంలోని 36 వార్డుల్లో టిడిపి ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈసందర్భంగా కుటాగుల ఒకటో వార్డు లో ఈ ' కార్యక్రమం ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్య పరుస్తూ , వార్డు లలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడుతామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బకాయిలు చెల్లించే వరకు సమ్మె కొనసాగింపు



సమ్మెలో భాగంగా నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - తాడిమర్రి

సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించేదాకా సమ్మె కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. మండలంలోని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు సిఐటియు తమ సమస్యల పరిష్కారం కోసం 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ధర్నాలో జి ఓబులు మాట్లాడుతూ 24 సంవత్సరాల నుండి కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొని వారికి తీరని అన్యాయం చేశారన్నారు. 572 మంది కార్మికులకు గ్రాడ్యుటీ ఇవ్వాలని బోర్డు సభ్యులు ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ లేదా జిల్లా కలెక్టర్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చే దాకా సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా తాము, తమ కార్మికులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మోటార్లు రన్ చేయాలని సత్యసాయి బోర్డు సభ్యులు డిఇ రామారావు కార్మికులపై ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు తిప్పేస్వామి, పామిడి డివిజన్ అధ్యక్షులు నబి రసూల్, కార్మికులు ఓబులేసు, సుధాకర్, రామకృష్ణ, తిరుపాలు, ఆచారి రవికుమార్, మహేశ్వర్ రెడ్డి, ఓబుళపతి తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి- పరిగి

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీరప్ప గుడి ఆవరణంలో మండల వ్యాప్తంగా ఉన్న ఆశ వర్కర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య .అతిథులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు హాజరయ్యారు. వరలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా ఆశావర్కర్లు కనీస వేతనాలకు నోచుకోకుండా పనిచేస్తున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఆశావర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాలు తీవ్ర తరం చేస్తామన్నారు. అనంతరం ఆశ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నాగరాజు, అధ్యక్షురాలుగా లలితమ్మ, కార్యదర్శిగా వరలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా వన్నమ్మ, సాకమ్మ, రామాంజనమ్మ, ఉపాధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి, ప్రమీలమ్మ, గంగరత్నమ్మ, కోశాధికారిగా వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు

బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

లేపాక్షి : మండల కేంద్రంలోనినవోదయ పాఠశాల వద్ద హిందూపురం నుండి చిలమత్తూరుకు వెళ్లే ప్రధాన రహదారి లో ద్విచక్ర వాహనాన్ని ప్రయివేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... రొద్దం మండలం కొట్టాల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, భార్య అనిత, వారి కుమారుడు యశ్వంత్ కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఎరిస్వామి కూతురు హిమబిందు పాఠశాలలో చదువుతుండగా ఆమెను చూడటానికి వీరు వెళుతున్నారు. వీరి వాహనాన్ని ప్రయివేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎర్రిస్వామికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. యశ్వంత్‌కి కాలు విరిగింది, అనితకు గాయాలు అయ్యాయి. స్థానికులు వీరిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.ఎర్రిస్వామి పరిస్థితి విషమంగా ఉండటం తో బెంగుళూరుకు తరలించారు సంఘటన స్థలాన్ని సిఐ వేణుగోపాల్ పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

రొద్దం : మండలంలోని ఆర్. మరువపల్లికి చెందిన ఓ దినపత్రిక విలేకరి తల్లి ఆదివారం మృతిచెందాడు. విలేకరి సోమశేఖర్ తల్లి అదేమ్మ(85) ఆదివారం మృతిచెందిన విషయం తెలుసుకొన్న పలువురు నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి, టిడిపి రాష్టకార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ, మాధవ నాయుడు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపిపి నరసింహులు, తిరుపాల్ నాయుడు, క్రిష్టప్ప, పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరహరి, టైలర్ ఆంజనేయులు, మురళి, హరీష్, సానిపల్లి సూరి, అక్కులప్ప, నారాయణ రెడ్డి, సి నారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ విజేతలకు జ్ఞాపికలు

పుట్టపర్తి రూరల్: సత్యసాయిబాబా జయంతి సందర్బంగా పుట్టపర్తిలో జిల్లాస్తాయి షటిల్ టోర్నమెంట్‌ను రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి డబుల్స్ 33 జట్లు, సింగల్ 20 మంది పాల్గొన్నారు. విజేతలకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మెంబెర్ శ్రీ రత్నాకర్ రాజు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులుగా పివి. రమణారెడ్డి, సామకోటి శివయ్య, కైలాష్ కుమార్, ప్రకాష్ రెడ్డి, సూర్యాగౌడ్, భాస్కర్ రెడ్డి చంద్ర, హరి, ప్రతాప్ రెడ్డి, రవి, ప్రభాకర్ రెడ్డి, హనుమంత రెడ్డి, మోహన్, ప్రసాద్ తదితరులు వ్యవహరించారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

కదిరి టౌన్ : క్షయ వ్యాధి కొత్త రూపు సంతరించుకుంటోందని మందుల వాడకంతో ఈ వ్యాధిని అరికట్టాలని జాయింట్ డైరెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. ఆదివారం పట్టణంలోని తాయిగ్రాండ్‌లో కదిరిలో మొట్టమొదటిసారిగా సత్యసాయి జిల్లాలోని డాక్టర్లకు క్షయ వ్యాధిపై నేషనల్ వర్క్ షాప్ నిర్వహించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పెడియాట్రిక్స్ సత్యసాయి జిల్లా వారి ఆధ్వర్యంలో నేషనల్ ట్యూబర్క్యోసిస్ ఎలిమినేషన్ పోగ్రాంను నిర్వహించారు. వైద్యరంగంలో కూడా రూపు మారుతున్న క్షయవ్యాధిని నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్షయ వ్యాధి వ్యాప్తి -నిర్మూలన- కొత్త మందుల వాడకం అనే విషయాలపై కర్నూల్ , అనంతపురం , సత్యసాయి జిల్లా నుంచి వచ్చిన దాదాపు 70 మంది డాక్టర్లు, సహాయక సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎపిఎంసి డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షకులుగా వ్యవహరించిన ఈ సదస్సులో డిఎంహెచ్ఒ ఎస్‌వి. కృష్ణారెడ్డి, వైద్యులు కేశవులు, వెంకటరమణ, చంద్రశేఖర్ రెడ్డి, మదన్ కుమార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యులు



లేపాక్షి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (ఇన్‌సెట్‌లో ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ)

స్టాఫ్ నర్సులే డాక్టర్లు

ప్రజాశక్తి - లేపాక్షి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యాధికారులు సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెలలో ఎక్కువ రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని రోగులు వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన ఆశాఖ ఉన్నతాధికారులు ఇటువైపు దృష్టి సారించకపోవటంతో వీరు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. రోగులు చిన్నపాటి జబ్బుకు కూడా వేలాది రూపాయలు ఖర్చుచేసి ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆసుపత్రిలో కేవలం ఇద్దరు మాత్రమే ట్రెయినీ నర్సులు అందుబాటులో ఉంటున్నారు. నిరంతర సేవల ద్వారా ప్రజావైద్యం అందించే ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదివారం లేపాక్షికి అధికసంఖ్యలో పర్యాటకులు, నవోదయ పాఠశాల, మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులను చూడటానికి విద్యార్థుల బంధువులు వందల సంఖ్యలో వస్తారు. లేపాక్షి కేంద్రం సంత మార్కెట్ ఉండటం తో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇంత రద్దీ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి గాయపడిన వారికి కనీస వైద్యం అందించడానికి కూడా వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో క్షతగాత్రులను హిందూపురం ఆసుపత్రికి తరలించాల్సి వస్తుంది. ఆదివారం రెండు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించడానికి వైద్యులు అందుబాటులో లేరు.

తెరుచుకోని ఆయుర్వేద వైద్య కేంద్రం

లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో దీర్ఘకాలిక రోగుల కోసం ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్య కేంద్రం తలుపులు ఎప్పడు తెరుచుకుంటాయో తెలియని పరిస్థితి ఉంది. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఎలాంటి వైద్య సేవలు అందించని ఆయుర్వేద వైద్య కేంద్రంతో ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తచెరువు : సోమవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు నివాళి అర్పిస్తామని చెప్పారు.

అమరాపురం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో55వ గ్రంథాలయ వారోత్సవాలకు సంబందించిన కరపత్రాలను లైబ్రరీయన్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రంథాలయ నిర్వహిస్తున్నామన్నారు.



చిలమత్తూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు : స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుండి 20 వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల గ్రంథాలయ అధికారి మల్లికార్జున తెలిపారు. సోమవారం బాలల దినోత్సవంతో మొదలైన ఉత్సవాలు 20 వ తేదీన ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానంతో ముగుస్తుందన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలకు సంబందించిన ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు.

ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి-హిందూపురం

ఆర్టీసీ కార్మికుల సమస్యలతో పాటు డిపోల్లో నెలకొన్న సమస్యలు అన్నింటిని ఐక్య పోరాటాలతో పరిష్కరించుకుందామని ఎన్‌ఎంయు జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ డిస్పెన్సరీ ఆవరణంలో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగినది. ఈ సమావేశానికి డిపో చైర్మన్ కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జోనల్ కార్యదర్శి యం.చెన్నారెడ్డి, రీజినల్ చైర్మన్ ముత్యాలప్ప, రీజినల్ అధ్యక్షులు ఆశ్వర్థమయ్య, రీజినల్ కార్యనిర్వాహక అధ్యక్షులు రాజారెడ్డి, రీజినల్ కార్యదర్శి టి షబ్బీర్ హాజయ్యారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆదాయం పేరుతో కోడికొండ చెక్ పోస్టు, పావగడ, శ్రీరంగరాజులపల్లి, అనంతపురం సర్వీసుల టైమింగ్ మార్పు చేశారని దీనిని రద్దు పరచి పాత టైమింగ్ పెట్టాలని తొలగించిన సర్వీసులను తిరిగి పునరుద్ధంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిద్దామనితీర్మానం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గోపాల్, మహిళా నాయకురాలు భారతి, విజయలక్ష్మి, డిపో అధ్యక్ష కార్యదర్శులతో పాటు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన కేంద్రం

ప్రజాశక్తి - నల్లచెరువు

నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేట ముంచిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. మండల కేంద్రంలోని గీతా మందిరంలో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ సర్కిల్ సమావేశానికి ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనలో భాగంగా ఇచ్చిన హామీలను ఏమాత్రం ప్రస్తావించకుండా మూడు లక్షల కోట్ల రూపాయల విలువైన విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ను కేవలం రూ. 30 వేల కోట్లకు ప్రయివేటు పరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేవలం తన రాజకీయ లబ్ధి కోసం పార్టీ అభివృద్ధి కోసం ఈ పర్యటన నిర్వహించారని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేవలం కొంతమంది వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈ ఎస్. వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం శ్రీరాములు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే



ఆసుపత్రి భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు, అధికారులు

ప్రజాశక్తి కదిరి టౌన్

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని స్థానికఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసాతో కలసి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మహమ్మద్, ఆవులస్వామి పర్యవేక్షణలో హెల్త్ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినందుకు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. కదిరి ఏరియా ఆసుపత్రి నందు 18 కోట్ల రూపాయలతో ఆధునిక వసతులతో భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు.కరోనా కారణంగా ఆలస్యమైన కూడా తొందరలోనే అన్ని భవనాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, డిఎం హెచ్ఒ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము గంగాదేవి, రాజశేఖర్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, కౌన్సిలర్లు గంగాభవాని, పిచ్చిలి శంకర, మురళి, రంగారెడ్డి, ఖాసీం, కృపాకర్ రెడ్డి, ఇస్మాయిల్, జిలాన్, కిన్నెర కళ్యాణ్, నౌసాద్, షాను, దాదా పీర్, షాన్వాజ్, రాంప్రసాద్, ఎం ఎన్ ఫయాజ్, షబ్బీర్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాగరాజు, ఆసుపత్రి సిబ్బంది వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్‌లో నటిస్తున్న పవన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

జగన్ చేస్తున్న అభివద్ధి చూసి ఓర్వలేని చంద్రబాబు దర్శకత్వంలో పనిచేస్తున్న దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని శాసనసభ్యుడు దద్దుకుంట శ్రీధర్ రెడ్డి విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు జగనన్న కాలనీలను 75 వేల ఎకరాల్లో నిర్మిస్తుంటే జనసేన పార్టీ వారు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. నియోజకవర్గంలో 30 వేలు ఇళ్లు నిర్మించి తీరుతామన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. పవన్ సభ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఆయన హావభావాలు సినిమాల్లో సరిపోతాయే తప్ప రాజకీయాల్లో ఉపయోగపడవన్నారు. జనసేన నాయకులు కాలనీల్లో పర్యటించి ఇళ్ల పూర్తి కాలేదని గగ్గోలు పెడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం బాబు హయాంలో పెండింగ్ లో ఉన్న బిల్లులను మంజూరు చేయడమే గాక, ప్రస్తుత ఇళ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తోందని చెప్పారు. గృహ నిర్మాణంలో కానీ, అభివృద్ధిలో కానీ ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్‌కు బుద్ధి రాలేదన్నారు. అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిన జగన్ 2024 లో తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు, కుట్రలు చేసిన వైసిపి విజయాన్ని ఆపలేరన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోరుబావిలో ఉబికి వస్తున్న నీరు

ఓబుళదేవరచెరువు

మండలం పరిధిలోని గాజుకుంటపల్లిలో ఓ బోరుబావిలో ఎలాంటి మోటరు సాయం లేకుండానే నీరు ఉబికి వస్తోంది. గ్రామానికి చెందిన షానవాజ్ ఖాన్ రెండున్నరేళ్ల క్రితం 600 అడుగులు బోరు బావి తవ్వించాడు. బోరు వేస్తున్న సమయంలో కొద్దిగా నీరు పడటంతో, ఉన్న కొద్దిపాటి నీటితోనే పంటలు వేయాలని మోటారు బిగించాడు. కొన్ని రోజుల తర్వాత బోరులో నీరు ఎండిపోవడంతో మోటారు తీసేశాడు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో బోరుబావిలో వాటంతకు అవే నీరు ఉబికి వస్తున్నాయి. వెయ్యి అడుగుల తవ్వినా చుక్క నీరు పడని ఈ కరువు ప్రాంతంలో బోరు బావిలో వాటంతటవే నీరు ఉబికి వస్తుండడంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. వెంటనే మోటారు బిగించి పంట సాగు చేస్తానని ఆయన చెప్పాడు.



బోరు బావిలో ఉబికి వస్తున్న నీటిని చూపుతున్న రైతు

జగనన్న ఇళ్లతో పేదలకు కన్నీళ్లు : జనసేన



నివాసయోగ్యం కాని స్థలాన్ని చూపుతున్న నాయకులు

కదిరి టౌన్ : పట్టణంలోని గట్ల దగ్గర ఉన్న టిడ్కో నివాసాలను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి కదిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్‌తో కలసి సందర్శించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి 80శాతం గృహ నిర్మాణాలను పూర్తి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన వాటిని పూర్తి చేయకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. టిట్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని పాపిరెడ్డి పల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఇళ్ల స్థలాలు నివాసయోగ్యంగా లేవని జనసేన నాయకులు విమర్శించారు. జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీళ్లు అనే కార్యక్రమంలో భాగంగా జనసేన మండలాధ్యక్షులు జబీబుల్లా షేక్ ఆధ్వర్యంలో పాపిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటుచేసిన లే అవుట్‌లో నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్థలంలో సుమారు 140 మందికి ఇళ్ల స్థలాల కేటాయించారన్నారు. ఇది అటవీ ప్రాంతమని చౌడు నేలలు అని రహదారి సౌకర్యం లేదని అన్నారు. దీంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవటానికి ఇష్టపడటం లేదని అన్నారు. ఇప్పటి దాకా కనీసం 10 శాతం నిర్మాణాలు కూడా పూర్తి కాలేదని తెలిపారు ప్రభుత్వం ఇలాంటి నివాసయోగ్యంలేని స్థలాలను పేదలకు అందించడం దౌర్భాగ్యమైన చర్యఅని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లప్ప, నరసింహమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, కాశీం, రామకృష్ణ, శ్రీకాంత్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం

హిందూపురం : పట్టణంలోని శ్రీ గుడ్డం రంగనాథ స్వామి బ్రహ్మ రథోత్సవం వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. శ్రీమన్నారాయణ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయంలో శ్రీ రంగనాథ స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధాత్రి హోమం నిర్వహించారు. శ్రీవారిని శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంలో ఊరేగించారు. ఈ సందర్భంగా దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోవింద శర్మ, ఎఒ నాగేంద్రుడు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్ జెపికె.రాము, వైస్ ప్రెసిడెంట్ గౌర శంకర్, సెక్రటరీ మహాదేవ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎంఎ. కిషోర్ కుమార్, సి. శ్రీరాములు, ట్రెజరర్ కెకె.శ్రీధర్, టి.ఎ.రూప ఆర్. నాగభూషణం, బి. నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.